కథ

# నిర్ణయం

## శ్రీధర శ్రీరామకృష్ణ

ప్రేమమాటున మోసం— నయవంచన. దారితప్పిన జీవితాన్ని సరిదిద్దుకోవడానికే నానా అవస్థ పడాల్సి వచ్చింది. పెళ్లి సమస్యలకు పరిష్కారమా? పోనీ పెళ్లి లేకుండా ఉండగలదా? ఏమిటి నిర్ణయం?

'చీకటి వెలుగుల రంగేళీ! జీవితమే ఒక దీపావళి!' అని ఓ సినీ కవి అన్నాడు. అది నా విషయంలో ఏ మాత్రం నిజం కాదు.

ఊహ తెలిసీ తెలియని వయసులో ఏం సుఖపడ్డానో గానీ ప్రస్తుతం నా జీవితంలో చీకటి తప్ప వెలుగులేదు. కారు చీకటి తప్ప కాంతిపుంజం లేదు. బాధల బరువులు తప్ప సంతోషపు సరిగమలు లేవు.

ప్రాణానికి ప్రాణంలా చూసుకునే అమ్మ చిన్నతనంలోనే పోయింది.

తల్లి ప్రేమను చవిచూడటం అనేది మనిషికి దేవుడిచ్చిన వరం అనుకుంటాను.

అమ్మ అన్న రెండక్షరాల పదం తల్చుకుంటేనే, గుండె లోతుల్లో గూడు కట్టుకున్న ఎలాంటి బాధనుంచైనా, ఒక క్షణంపాటు ఉపశమనం కలుగుతుంది.

అమ్మ ఎంత ప్రేమగా చూసుకునేది!

ఆరేళ్ళ వయసొచ్చే దాకా గోరుముద్దలు తినిపిస్తూ, స్కూల్‌లో జాయిన్ చేసినప్పట్నుంచీ, పొద్దున్నే వెన్న ముద్దలాంటి ఇడ్లీలు చేసి, నేతిలో ముంచి, పంచదారలో అద్దిపెడుతూ, మధ్యాహ్నం స్కూల్ నుండి వచ్చేటప్పటికి కమ్మటి ముద్దపప్పు, గడ్డ పెరుగు, పువ్వుల్లాంటి అన్నం సిద్ధం చేసి కొసరి కొసరి తినిపిస్తూ, సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి చేరాక, గింజలు తీసిన పనసతొనలో, దొడ్లో చెట్టుకి కాసిన చిన్నదొర జాంపండో, సీతాఫలం పండో, బొప్పాయి పండు ముక్కలో, నిప్పుల మీద కాల్చిన చిలకడ దుంపో, ఆడించిన శనగ పిండితో, నువ్వులు వేసి స్వయంగా తయారు చేసిన జంతికలో, పకోడీలో, ఏదో ఒకటి తినిపించి, చిన్న గ్లాసు నిండా చక్కె...



పాలు తాగిస్తూ, రాత్రికి పప్పులోకి వడియాలో, అప్పడాలో, చల్ల మిరపకాయలో వేయించి, తినిపించి, కంచం నిండా చిక్కటి మజ్జిగపోసి తాగిస్తూ, ఇక ఎప్పుడైనా నాన్న కోప్పడి చిన్న దెబ్బవేస్తే, గుక్కపట్టి ఏడుస్తున్న నన్ను పొదువుకుని, చిన్నపిల్లలా తనూ కళ్ళ నీళ్ళు పెట్టుకుని, నాన్నతో రెండ్రోజులు మాట్లాట్టం మానేస్తూ, ఇన్ని మాటలెందుకు! కుందేలు పిల్లని పెంచినంత జాగ్రత్తగా పెంచుకుంటూ, కంటికి రెప్పలా కాపాడుకుంటూ, తన ప్రేమాభిమానాల విరులగిన్నెలలోని తేనె రుచి చూపించేది. అలాంటి ప్రేమమయి అయిన అమ్మ, చెప్పా పెట్టకుండా నాన్నని, నన్ను వదిలేసి, 'చిరునవ్వు చెదరకుండానే కన్నుమూసింది

తర్వాత డాక్టర్లు అమ్మ పోవటానికి కారణం గుండెపోటని నిర్ధారించారు. అది వేరే విషయం.

తర్వాత, నన్ను చూడటానికి మనిషి కావాలనో లేక తనకి ఉత్తర వయస్సులో మనిషితోడు అవసరం ఉంటుందనో, నాన్న మా దూరపు చుట్టాల్లో నాకు పిన్నివరస అయ్యే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆమె తమ ఇంట్లో వాళ్ళ బలవంతానికి నాన్నను పెళ్ళి చేసుకుంది గానీ ఆయనంటే ఇష్ట పడికాదు. అది ఆమె ప్రతీ మాటలోనూ, చేష్టలోనూ వ్యక్తమవుతూ ఉండేది. నా మీద అమితమైన ప్రేమ ఉన్న నాన్న, నన్ను చిన్న మాట అనటం కూడా సహించే వాడు కాదు. కానీ ఆమె ప్రవర్తన మరీ మొండిగా తయారయ్యేది. వాన మాత్రం ఎన్నాళ్ళు ప్రతిఘటించగలదు. తనంతట తనకి మా మీద ప్రేమ ఉండాలి గానీ! కొన్నాళ్ళకి నాన్న మౌనంగా ఉండటం అలవాటు చేసుకున్నాడు. నన్నెప్పుడైనా మరీ అనవసరంగా తిట్టినా, చీదరించుకున్నా, వేడి అన్నం, కూర కాకుండా, పాచిపోయిన అన్నం, ముందు రోజు మిగిలిన కూరలూ పెట్టినప్పుడు మాత్రం కళ్ళనీళ్ళు పెట్టుకుని, 'నా కూతుర్ని క్షోభ పెడితే పుట్టగతుల్లేకుండా పోతావే' అని తిట్టుకుంటూ బయటకు వెళ్ళిపోయేవాడు. రెండ్రోజులు ఏ ఫ్రెండ్ ఇంట్లోనో గడిపి మళ్ళీ వచ్చేవాడు.

విపరీతమైన మానసిక క్షోభవల్ల, అస్తమానూ అమ్మ గురించిన ఆలోచనవల్ల సరియైన తిండి సమయానికి అందించే వారు లేకపోవటంవల్ల, పైబడుతున్న వయస్సువల్ల నాన్నకి పక్షవాతం వచ్చి ఎడమ కాలు, చెయ్యి పడి పోయాయి. మాట కూడా ముద్దగా మారి క్రమంగా అదీ పడిపోయింది.

ఇక, ఆ సవతి తల్లి పెట్టే బాధలు భరిస్తూ ఎలాగో ఇంటర్ మీడియట్ పూర్తి చేసాను. డిగ్రీ ఫస్టియర్‌లో ఉండగా నాన్న కూడా పోయాడు. ఇక ఆమె పెట్టే కష్టాలకి అంతులేకుండా పోయింది. తెల్లవారు జామునే లేపి గుట్టడు అంట్లు తోమించేది. పెద్ద బక్కెట్టు నిండుగా బట్టలుతికించేది పొద్దుటా, సాయంత్రం లంకంత దొడ్డి ఊడిపించేది. స్నేహితురాళ్ళ ఇళ్ళకు వెళ్ళకూడదని ఆంక్షలు పెట్టేది. అయినా మౌనంగా భరిస్తూ వచ్చాను. చివరకు బయటకు పొమ్మని మెడపట్టి గెంటేసింది.

అప్పట్నుంచి, తెల్సున్న వాళ్ళింట్లో, వాళ్ళ దయా దాక్షిణ్యాల మీద బతుకుతూ, అమ్మ తరపు దూరపు బంధువుల సాయంతో డిగ్రీ పూర్తి చేసాను. అతి కష్టం మీద ఒక ప్రైవేట్ కంపెనీలో క్లర్క్ ఉద్యోగం సంపాదించుకుని, దాంతో వచ్చే కొద్దిపాటి సంపాదనతో బతుకు నెట్టుకొస్తున్నాను.

అలా నిస్సారంగా నడిచిపోతున్న నా జీవితంలో సుధీర్ తారసపడ్డాడు. మా ఆఫీసున్న వీధిలోనే ఒక రూమ్‌లో ఉండేవాడు. ఒక రోజు ఆఫీసు టైం అయిపోయిందన్న హడావుడిలో ఒక చేత్తో ఫైల్స్, రెండో చేత్తో టిఫిన్ బాక్స్ పట్టుకుని వడివడిగా అడుగులేస్తున్నాను. వెనకాల నుండి 'ఏమండీ! ఏమండీ!' అని ఎవరో నన్నే పిలుస్తున్నట్టనిపించి వెనుక తిరిగి చూసాను. చక్కని దేహధారుడ్యం, ఆకర్షణీయమైన మొహంకల ఓ యువకుడు నావైపే స్పీడుగా నడుచుకుంటూ వస్తున్నాడు. అతని చేతుల్లో నాలుగైదు పేపర్లు ఉన్నాయి. దగ్గరగా వచ్చి వాటిని నాకందిస్తూ 'మీ ఫైలులోంచి జారిపోయాయి' అన్నాడు. తీసి చూసుకున్నాను. చాలా ఇంపార్టెంట్ పేపర్స్. 'థాంక్స్' చెప్పాను. జవాబుగా అతను 'థాంక్స్' అన్నాడు. అదేమిటి నేను 'థాంక్స్' చెపితే, మీరు 'థాంక్స్' చెప్తున్నారని అడిగితే 'అందమైన అమ్మాయి చేత థాంక్స్ చెప్పించుకోవటం, ఓ అందమైన అనుభూతి' అలాంటి అనుభూతిని మీరు నాకు కలిగించారు.

ఎడారిలాంటి నా జీవితానికి అతని మాటలు అమృతజల్లుల్లా అనిపించేవి. తియ్యని మాటలు మాట్లాడుతూ నన్ను లోబర్చుకోవాలని చూసాడు. జీవితంలో ఆటుపోట్లు అనుభవించిన దాన్ని గనుక అంత తేలికగా లొంగలేదు. పెళ్ళి అనే తాయిలం చూపించి, తండ్రిపోయి ఏడాదిలోపే అవటంతో తమ ఇంట్లో ఏ శుభ కార్యమూ జరగకూడదని సాకుచెప్పి, ఓ ఏడాదిపాటు నా తనువుతో చనువుగా మెలిగాడు. ఒకనాడు పెళ్ళి గురించి గట్టిగా అడిగితే, మళ్ళీ కనబడకుండా పోయాడు.

ఎంతటి నయవంచన!

పెళ్ళి మత్తులోపడి అతని వివరాలేమీ సేకరించకపోవటం చాలా తప్పైంది. గుడ్డిలోమెల్ల. ఆ దేవుడి దయవల్ల నాకు గర్భం రాలేదు. అప్పట్నుంచి జీవచ్ఛవంలా బతుకు నెట్టుకొస్తున్నాను.

ఈ మధ్య ఆఫీసులో అటెండర్ సుబ్బారావు కూడా రెండర్థాల మాటలు మాట్లాట్టం మొదలెట్టాడు. తోడూ, నీడాలేని ఒంటరి దాన్నని, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాననీ కనిపెట్టినట్టున్నాడు. ఒక రోజు ఎవరూ లేకుండా చూసి చెయ్యి పట్టుకుని 'సినిమా కెళ్దామా' అని అడిగాడు. చేతిని విదిలించుకుని గబగబా బయటికి వెళ్ళిపోయాను. నలుగుర్నీ పిలిచి, వాళ్ళ ముందు వాణ్ణి దులిపేద్దామా అనిపించింది. కానీవాడు చాలా తెలివిగా తప్పించుకుంటాడు. నేనే అల్లరైపోతాను. అందుకే కోపాన్ని, బాధని నాలోనే దిగమింగుకున్నాను.

మనసు బాగోక, సాయంత్రం ఆఫీసయ్యాక అలా కాసేపు బజార్లో తిరిగి వద్దామని బయల్దేరాను. దార్లో శ్రీలేఖ కనిపించింది. తను నా చిన్ననాటి స్నేహితురాలు. నన్ను చూసి కౌగిలించుకుంది. చిన్ననాటి నేస్తమైన నన్ను చాలారోజుల తర్వాత కల్సుకున్నందుకు ఎంతో సంతోషించింది. దగ్గర్లో ఉన్న స్టార్ హోటల్‌కి తీసుకెళ్ళింది. టిఫిన్ తిని, టీతాగాం. బిల్లు తనే పేచేసింది. తనతో బాటు కార్లో నన్ను వాళ్ళింటికి పిలుచుకెళ్ళింది. టేబుల్ మీదున్న మాగజైన్స్ చూస్తుండమని చెప్పి లోపలికెళ్ళి డ్రస్ ఛేంజ్ చేసుకుని వచ్చింది. నిజానికి తనకంటే నేనే అందగత్తెని. కానీ తను ధరించిన ఖరీదైన వస్త్రాలు, విలువైన నగలవల్ల, రెగ్యులర్‌గా బ్యూటీ పార్లర్‌కి వెళ్ళి, తన అందానికి మెరుగులు దిద్దుకునే అలవాటు ఉండటంవల్ల, తనే నాకంటే కాస్త ఆకర్షణీయంగా ఉంది. నా పక్కన కూర్చుని నేనెక్కడ ఉండేదీ మొదలైన వివరాలన్నీ అడిగింది. చెప్పాను

తమకున్న ఆస్తుల గురించి, తన భర్తకున్న సోషల్ స్టేటస్ గురించి, అత్తగారికి తన మీదున్న ప్రేమాభిమానాల గురించి చెప్తోంది తను.

ఇంతలో కాలింగ్ బెల్ మోగింది.

శ్రీలేఖ వెళ్ళి తలుపుతీసింది.

ఎదురుగా పదహారేళ్ళ కుర్రాడు.

'ఫిక్సెల్ లామినేషన్స్ నుంచి వచ్చానమ్మా! సార్ రెండ్రోజుల క్రితం, మీ ఫామిలీ ఫోటో ఇచ్చి లామినేట్ చేసి పంపమని బిల్ కూడా పే చేసేసారు!' అంటూ తనకి ఒక పెద్ద లామినేటెడ్ ఫోటో అందించి వెళ్ళిపోయాడు.

'మా హనీమూన్ ట్రిప్‌లో తీయించుకున్న ఫోటో. రెండ్రోజుల క్రితం లామినేషన్ కిచ్చాం. చేసి తీసుకొచ్చాడు. ముందుగా మా ఆయన్ని, ఫోటోలో చూడు. తర్వాత ప్రత్యక్షంగా చూద్దువుగాని' నవ్వుతూ అంటూ దాన్ని నాకందించింది తను.

అందుకుని, దాని మీద అందంగా ఉన్న ప్యాక్‌ను తొలగించాను. రూమ్‌లో ఉన్న ట్యూబ్‌లైట్ కాంతి పడి ఆ ఫోటో వింతగా మెరుస్తోంది.

ఆ ఫోటోను చూడగానే ఏదో అపస్వరం విన్నట్టైంది.

ఫోటోను పరీక్షగా చూసాను.

నాకు కళ్ళు తిరుగుతున్నట్టనిపించింది. ఒంట్లో శక్తినంతా ఏదో అదృశ్య శక్తి హరించినట్టై, స్పృహ తప్పుతుందేమోనన్నంత నిస్సత్తువ కలిగింది. సున్నితమైన నా గుండెనెవరో గట్టిగా పిండినట్టైంది.

తాము హనీమూన్ ట్రిప్ ఎలా ఎంజాయ్ చేసిందీ, తన కోసం ఎలాంటి అపురూపమైన కానుకలు కొన్నదీ, జంటగా ఎలాంటి వింత వింత ప్రదేశాలు సందర్శించిందీ, పదిహేను రోజులు పదిహేను క్షణాల్లో ఎంత త్వరితంగా, ఎంత మధురంగా గడిచిందీ, కనుబొమ్మలు కదలాడిస్తూ, కథలు కథలుగా చెబ్తూ ఉంది తను.

అవేమీ నా చెవికెక్కటం లేదు. దిబ్బెడేసినట్లయి, శరీరం మొద్దుబారి పోయింది. ఇంకో నిమిషం పాటు అక్కడే కూర్చుంటే, నేనేమైపోతానో నన్న భయం కలిగింది నాలో.

కారణం ఫోటోలో శ్రీలేఖ భుజం చుట్టూ చేతులువేసి, దగ్గరగా నుంచుని, చిద్విలాసంగా నవ్వుతున్నది ఎవరో కాదు. నన్ను అనుభవించి, వంచించి జీవితం మీద ఉన్న కొద్దిపాటి ఆశనూ చంపివేసిన సుధీర్.

అతికష్టం మీద కుర్చీలోంచి లేచి 'వస్తాను శ్రీలేఖా! ఇప్పటికే చాలా పొద్దుపోయింది' అన్నాను.

'మా వారిని చూడకుండానే' అంది తను.

'మళ్ళీ ఎప్పుడైనా వస్తాలే! ఇంకా లేటయితే హాస్టల్ మైన్‌గేట్ మూసేస్తారు' అని చిరునవ్వు ముఖం మీద అతికించుకుని, తన అనుమతి కోసం ఎదురు చూడకుండానే బయటి కొచ్చేసాను.

హాస్టల్ వైపు అడుగులు వేస్తూ, స్థిరంగా నిర్ణయించుకున్నాను.

'నన్ను మోసం చేసి, వేరే పెళ్ళి చేసుకుని, అతను హాయిగా కాపురం చేసుకుంటూ జీవితాన్ని ఎంజాయ్ చేస్తుంటే, స్వంత కాళ్ళ మీద నిలబడగలిగిన నేను మాత్రం జీవితాన్నో మోడులా గడుపుతూ, చేదు అనుభవం లాంటి గతాన్ని అనుక్షణం తలుచుకుంటూ ఎందుకు బాధపడాలి! జరిగిందాన్నో పీడకలగా, కేవలం పీడకలగా భావించి, ఈ మధ్యే మా బంధువుల ద్వారా వచ్చిన మంచి సంబంధానికి సమ్మతి తెలియజేయాలి అనుకున్నాను. అప్పుడు ఆఫీసులో అటెండర్ సుబ్బారావు లాంటి వాళ్ళ నోళ్ళు కూడా మూతబడతాయి!

ఇప్పుడు నా అడుగులు స్థిరంగా పడుతున్నాయి.

ఎక్కడో దూరం నుంచి కోయిల కూసింది. నా జీవితంలో రానున్న వసంతానికి స్వాగత గీతిలా... మధుర మంజులగాన తరంగంలా...